గోవా జానపద గాథలు-కథకులు

రచయిత వి.ఎస్.సుక్తాంకర్
అనువాదం పాలగుమ్మి పద్మరాజు

నిఘుప్పైనతోకే......

పద్మనాభసేర్ జీవితంలో ఈవేళొక పర్వదినం. ఈ వూళ్లో 'బామన్లు'—అంటే సారస్వత బ్రాహ్మలకీ, సేర్ లంటే విశ్వబ్రాహ్మలకీ, వానీలు—అంటే కోమట్లకీ, ఎప్పుడూ పోటాపోటీలు. పద్మనాభసేర్ ఆ వూరిసేర్ లందరిలోకీ పెద్ద. 'బామన్ల'లో కందరికి పోరోబ్ కుటుంబం మంచి ఉచ్ఛస్థితిలోఉంది. మూడు తరాలుగా రెజీదారుద్యోగం (గ్రామ మునసబులాంటిది) వాళ్లసొత్తైపోయింది. వానీలందరిలోకీ ఖోలోప్ కుటుంబం బట్టల వర్తకంలో లక్షలార్జించారు. ఈ రెండు కుటుంబాలమీదా తనదే పైచెయ్యి అనుపించుకోవాలని పద్మనాభసేర్ తాపత్రయం. పండగల్లో, పబ్బాల్లో వాళ్లని వోడించాలని చాలా ప్రయత్నం చేశాడు. పంచాయతీ ఎన్నికల్లో కూడా వాళ్లతో పోటీపడ్డాడు. పర్వదినాల్లో దేవాలయంలో ప్రతికులంవారూ ప్రదర్శించే నాటకాల్లో, ప్రభుత్వోద్యోగుల కిచ్చే విందుల్లో, ఆ వూళ్లో జరిగే ప్రతివిషయంలో తను పూనుకుని ముందు కొచ్చేవాడు. అయితే ఈ పోటీ ఇన్నాళ్లు జరిగినా, నిష్కర్షగా అతనికి విజయం లభించలేదు. అందు కవకాశం ఇప్పుడు దొరికింది.

ఈవేళ అతని చిన్నారి కూతురు జయ పెళ్లి. ఆమె అతని కడసారిబిడ్డ. ఒకత్తే ఆడపిల్ల. మిగతా నలుగురు మొగపిల్లలకీ, పెళ్లిళ్లయిపోయి, తండ్రితో పాటు కులవృత్తి చేసుకుంటున్నారు. ఇలాంటి పెళ్లి ఆ వూళ్లో ఇదివరకెప్పుడూ జరగలేదనిపించాలని తండ్రితోబాటు వాళ్లకీ మంచి పట్టుదల.

క్రితం రాత్రి వూరేగింపులో పేల్చిన బాణాసంచాలాంటిది ఈమధ్యకాలంలో పోరోబ్, ఖోలోప్‌ల ఇళ్లలో జరిగిన ఏ పెళ్లిలో కూడా చూడలేదన్నారు వూళ్లో అంతా. బాణాసంచా మోతని మించిపోయింది అర్ధరాత్రి మేజువాణీ. కస్తూరీబాయి, మోగ్రీబాయి, సోదరీమణులంటే నాట్యంలో పెద్దపేర్లు. ముందువరసలో కూర్చున్న పోరోబూ, ఖోలోపూ 'ఏమిటీ వింత' అన్నట్టు చూపులతోనే సంప్రదించుకున్నారు. ఎందుకంటే ఈ సోదరీమణులు గొప్పవారి ఇళ్లకుతప్ప, తమ ఎత్తు ధనం పోసినా రారు. మేజువాణీ అయిపోయాక తెల్లవారుజామున ఇళ్లకు పోతున్న పెద్దలంతా కస్తూరిబాయి భావగీతాలూ, మోగ్రీబాయి కేర్వానృత్యం అద్భుతంగా ఉన్నాయని ఏకగ్రీవంగా అంగీకరించారు. అయితే అన్నిటికన్నా అద్భుతమైన వింత ఈవేళ పెళ్లి విందులో రుచి చూడబోతున్నామని వాళ్లెవరూ ఎరగరు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని అనుసరించి, పెళ్లి విందు అన్నిటికన్నా గొప్పగా ఉండాలని పద్మనాభసేర్ నమ్మకం. కులాచారాన్నిబట్టి బామన్లూ, సేర్లూ ఏక పంక్తి భోజనం చెయ్యకూడదు. అంచేత పోరోబ్ కుటుంబం వారెవరూ విందుకు రారు. అయినా విందులో ఏమేమి వడ్డించారో తప్పకుండా వాళ్లు వాకబుచేస్తారని, పద్మనాభసేర్ కి తెలుసు. ఖోలోప్ వారంతా ఎల్లాగా విందుకొస్తారు. వీరిద్వారా వారికి తెలుస్తుంది.

పద్మనాభసేర్ ఇంత సంతృప్తి ఇదివరకెన్నడూ అనుభవించలేదు. జరీ అంచు పీతాంబరం పట్టు పంచె కట్టుకుని, పంక్తుల మధ్య పచారుచేస్తూ, అతిథుల్ని తృప్తిగా భోజనం చెయ్యమని ప్రోత్సహిస్తున్నాడు. మామూలుగా పెళ్లి భోజనాల్లో వడ్డించే పిండి వంటలన్నీ అయిపోయాయి. అతిథులంతా ఆనందంగా తిన్నారు. అయితే వీటన్నిటివీ, తలదన్నే పిండివంట ఒకటి ఆఖర్ని వస్తోందని తెలిసే సరికి, వారి ఆశ్చర్యానికి, ఆనందానికి మేరలేదు. పద్మనాభసేర్ ఉత్సాహంతో ఉప్పొంగిపోతూ, పర్వతాల్లో పేర్చిన వెండి పళ్లాలతో వడ్డించేవాళ్ళు పందిట్లోకి రాగానే, ధారాళంగా వడ్డించమని వాళ్లని హెచ్చరించాడు. అతిథుల్ని ఉద్దేశించి రాజసం ఉట్టిపడేలాగ అన్నాడు, "మిత్రులారా! నేనేం జమీందారునికాను. పోరోబ్‌నీ, ఖోలోప్‌నైనా కాను. ఏదో నేనొక పేద విశ్వబ్రాహ్మణ్ణి. అయితే ఈ పెళ్లికూతురు నా కడసారిబిడ్డ. నలుగురు మగపిల్లల తరవాత లక్ష్మీదేవిలా మాయింట వెలిసింది. అంచేత ఏదో నా శక్తి వంచన లేకుండా తమబోటి పెద్దల్ని తృప్తిపరచి గౌరవించడానికి ఈ పెళ్లి విందు ఏర్పాటు చేశాను. మీ రాకవల్ల మాయిల్లు పావనమయింది. నా తల్లికి మీ ఆశీర్వచనం లభించింది. అయ్యా! మీ కిప్పుడు వడ్డిస్తున్న ఈ కుంకుంపువ్వు మిఠాయి పేరేమిటో మీ కెవరన్నా చెప్పగలరా?"

ఈ సవాలు విసిరి, అతను గర్వంగా అతిథుల వంక చూశాడు. అతిథులంతా మొగమాటం విడిచి ఆరగిస్తూనే ఉన్నారుకాని, ఆ మిఠాయి పేరుమాత్రం ఎవరూ చెప్పలేకపోయారు.

పద్మనాభసేర్ గర్వంగా రాజానవ్వు నవ్వాడు. ఆ తర్వాత చెప్పాడు. "దీనిపేరు షీవర్—కేవరీ. ఈ కనుమల కావలఉన్న జమీందారులూ, మహారాజులూ, ఆరగించే మిఠాయిది. ఈ అపురూపమయిన పిండివంటని నేను ఎల్లా చేయించ గలిగానని మీ కందరికీ ఆశ్చర్యంగా ఉండొచ్చు" ఈ మాటలని, అతను వంటశాలలోకి వెళ్లి, ఒక బాన కడుపు గల ముసలివాణ్ణి వెంటబెట్టుకుని వచ్చాడు. అతిథులందరికీ అతనొక 'భట్టు' అని ఎరుక పరిచాడు. గోవాలో మంచి ఉచ్ఛ స్థితిలో ఉన్నవారు సారస్వతబ్రాహ్మలైనప్పటికీ, వాళ్ళు చేపలు తింటారు. కాశ్మీరీ, బెంగాలీ బ్రాహ్మల్లాగా. భట్టులు చదువు సంధ్యల్లో సిరిసంపదల్లో వెనకబడ్డ కులమైనా, వాళ్లు శుద్ధ శాకాహారులు. ఈ భట్టుది శాహాపూర్. పేరు కేరూభట్టు. సాంగ్లీరాజావారి పాకశాలలో ప్రధానోద్యోగి. ఇటువంటి గొప్పవంట బ్రాహ్మణ్ణి సంపాదించడం మాటలా? తన దగ్గర బంధువున్నాడొకాయన—అంటేసాక్షాత్తూ తన చెల్లెలు బావగారి మేనమామకి వేలు విడిచిన తమ్ముడో, అన్నో, రామసేట్ అని—ఈ మధ్యనే శాహాపూర్‌లో ఇల్లూవాకిలీ ఏర్పరుచుకుని స్థిరపడ్డాడు. ఆయన పలుకుబడివల్ల దొరికాడీ భట్టు "ఇంత భగీరథ ప్రయత్న ఫలితంగా ఈనాడు మా పేద ఇంట్లో ఇటువంటి అపురూపమైన పిండివంట వండడం, మీవంటి పెద్దలది రుచి చూడ్డం జరిగింది. మన జిల్లాల్లో ఎవరూ దీని పేరన్నా ఎరగరు. దీన్ని వండినవాడు ఈకేరూభట్టు. మంచి శ్రోత్రియ బ్రాహ్మణుడు. సాంగ్లీ రాజావారికీ యనంటే ఎంతో అభిమానం" అంటూ ఆ పిండివంట పుట్టు పూర్వోత్తరాలు వివరించి, కులాన్ని

బట్టి వంకర్తులుగా కూర్చున్న అతిథులమధ్య, కేరూ భట్టు వెనకాల దొర్లుకుంటూరాగా, వచార్ల ప్రారంభించాడు పద్మనాభసేర్.

అప్పుడు అతనికంటపడ్డాడు త్రివిక్రమసేర్. ఆ వూళ్లో సేర్ లందరికీ వయసులో పెద్ద. ఇతను పోరోబ్, ఖోలోవ్‌లకు దాసోహం చేస్తూ, సేర్ కులానికి చేటు చేకూరుస్తున్నాడని చాలా కాలంగా పద్మనాభసేట్ అనుమానం.

"సరే ఇపుడితన్ని కాస్త ఎద్దేవ పట్టించొచ్చు" అని లోపల అనుకుని, వడ్డిస్తున్న ఆసామిని పిలిచి ముసిలిసేర్‌కి కాస్త షీవర్లు దండిగా వడ్డించమన్నాడు. త్రివిక్రమసేర్ చేతులు కంచానికడ్డంగా పెట్టి "డబ్బయ్యోయ్యపడిలోఉన్న తనవంటి ముసలాణ్ణి ఈవిధంగా మొగమాటపెట్టడం న్యాయంకాద" న్నాడు. పద్మనాభసేర్ పక పక నవ్వి అన్నాడు.

"నువ్వంటేమాత్రం నే నొప్పుకుంటానామామా! పోరోబ్ ఇంట్లోనో, ఖోరోవ్ ఇంట్లోనో అయితే ఇలాంటి అభ్యంతరాలు చెపుతావా నువ్వు? అదీగాక నీ భోజన పరాక్రమం వూరందరికీ తెలుసు. నువ్వసలు ఆ కథలో హరిదాసు కేమాత్రం తీసిపోవు. ఆ పదం నీకు తెలుసుగా—

"నిడుపైనతోకవాడి పేరేమిటిరా—
నెయ్యంతా మింగేశావు నీ మొహం మండా—

గోవా జానపద గాథలు

నిడుపై తోకవాడు హనుమంతుడురా"

పద్మనాభసేర్ హరిదాసు సంగతెత్తి ఈ పదం పాడేసరికి, పెళ్లి పందిరంతా నవ్వులతో మారు మోగింది. కేరూభట్టుమాత్రం అర్థంకాక అటూ ఇటూ చూశాడు. పద్మనాభసేర్ అది గమనించి "ఆహా నీదీ గోవాకాదుగా, కనుమల కవతలనించి వచ్చావు. ఈ హరిదాసు కథ మా పసిబిడ్డలకి కూడా తెలుసు. నీకు చెపుతా విను" అని కథ ప్రారంభించాడు.

"అనగనగా ఒక హరిదాసుండేవాడు. ఇదివరకెన్నడూ హరిదాసు మొహం ఎరగని ఒక వూళ్లో అతను నాలుగు నెల్లు తిష్ఠవేశాడు. వూళ్లోఅందరూ ఆ బ్రాహ్మణ్ణి అతి గౌరవంగా చూసేవారు. ప్రతి సాయంకాలం కథా కాలక్షేపానికి రావడమేగాక, హరిదాసుకి మంచి మంచి తినుబండారాలు కూడా సమర్పించుకునేవారు. హరిదాసుతో కూడా వంత పాటగా డొకడు ఉండేవాడు. అతను యువకుడు. హరిదాసే నోరూరే పిండివంటలన్నీ మెక్కుతుంటే ఆశగా చూసేవాడు. తన కేదన్నా కాస్త ముక్క రుచి చూపిస్తాడేమోనని, ఆశపడేవాడు. అయితే హరిదాసు మహా తిండిపోతు.

ఒకనాడొక రైతు ఒక గిన్నెతో నెయ్యి పట్టుకొచ్చి ఇచ్చాడు. దాని కమ్మని వాసనకి కుర్రవాడి నోరూరింది. ముసలాడే నెయ్యంతా తినలేడు. తనకి కాస్తయినా మిగిలితీరుతుందని ఆశపడ్డాడు. కాని హరిదాసు చిటికలో గిన్నంతా కాళీ చేసేశాడు. వంతపాటగాడికి పాపం నేతి మరకయినా మిగల్లేదు. సాయంకాలం హరికథ ప్రారంభమయింది. వంటపాటగాడి దుగ్ధమాత్రం చల్లారలేదు.

ఆనాడు 'లంకా దహనం' కథ చెపుతున్నాడు హరిదాసు. పల్లెజనానికి ఆ కథంటే మహా ఇష్టం. హరిదాసు ఉపోద్ఘాతం ఎలాగో లాగిపారేసి, కథ పట్టులో కొచ్చాడు. కాని పాపం. అతని కంగారేం చెప్పను? కథా నాయకుడైన కోతి దేవుడిపేర మర్చిపోయాడు. అతని భోజన శక్తి దిన దిన ప్రవర్ధమానమవుతోంది గాని, అతని జ్ఞాపకశక్తిమాత్రం ఆనాటి కానాటికి నీరసించిపోతోంది. అతను ఎక్కడన్నా మర్చిపోతే అందించడం, వంతపాటగాడి ధర్మం. అయితే అది అందించినట్టు సభా సదులకు తెలియకూడదు. పాడుతున్న పాటలోనే ప్రశ్న జోడించి, కథలో అదొక భాగం అనిపించేటట్టు హరిదాసు పాడతాడు. వంతపాటగాడు పాట రెండో పంక్తి పాడుతున్నట్టు నటిస్తూ, హరిదాసు మరచిపోయిన పేరు అతనికి అందిస్తాడు. వినేవాళ్లకు హరిదాసు అలిసిపోకుండా వంత పాటగాడు అందుకున్నట్టు అనిపిస్తుంది.

హరిదాసు ఆత్రంగా అడిగాడు.

"నిడుపైన తోకవాడి పేరేమిటిరా" అని పాడుతూ.

వంతపాటగా డీవేళ హరిదాసుకి మంచిపారం నేర్పాలని నిర్ణయించుకున్నాడు. తను సమాధానం చెప్పకుండా వూరుకున్నాడు. హరిదాసుని ఇరవై ముప్పైసార్లు అదే పంక్తి పదే పదే పాడనిచ్చి, ఆఖరికి కోపంగా గొంతెత్తి పాడాడు.

"నెయ్యంతా మింగేశావ్ నీ మొహంమండా,
నిడుపైన తోకవాడు హనుమంతుడురా!"

తన చమత్కారం, నటనా కౌశలంఅంతా ఉపయోగించి వినేవాళ్లు నవ్వినప్పుడల్లా ఆగి, కళ్లకు కట్టినట్టు ఆ కథ చెప్పి ముగించేసరికి పెళ్లి పందిరంతా నవ్వులతో వూగిసలాడిపోయింది. కేరూభట్టు బాన కడుపు కూడా అందులో పాల్గొంది.

నిజంగా ఇది పద్మనాభసేర్ జీవితంలో పర్వదినం. ఖోలోవ్‌లమీదేకాదు. కొమ్ములు తిరిగిన పోరోబ్‌లమీద కూడా గొప్ప విజయం సాధించాడు.

ఏళ్లు గడిచినకొద్దీ ఆ రాత్రి బాణ సంచా ధగధగలు జనం మర్చిపోవచ్చు. కస్తూరీ, మోగ్రీ ఆట పాటలు మరికొంత కాలానికి, మరపు తెరల మధ్య పడిపోవచ్చు. కాని, పద్మనాభసేర్ చేయించిన కేసరి షీవర్లు, దాని రుచిని తన చమత్కారంతో, హాస్యంతో అతను ఇనుమడింపజేసిన సంగతి, అతని గారాబు కూతురు, తన చిట్టితల్లి జయ, నలుగురు మొగపిల్లల తరవాత తన ఇంట వెలసిన లక్ష్మీదేవి పెళ్లి విందు ఇవన్నీ తర తరాలవరకూ ఆప్యాయంగా కథలా చెప్పుకుంటారు ఆ వూరి జనం.

(అయిపోయింది) ●

పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైనచర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళనిమిషములున్నూ, మీ సరియైన విరునామాన్నూ, వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మియొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1.25 పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A. W. P.)
P. O. BEAS (Amritsar.)

కండ్ల అందానికి రక్షణకు

దర్బార్ కాజల్
కాటుక (రిజిస్టర్డు)

తయారుచేయువారు:-
రాంబీర్ కంపెని, బొంబాయి-4.